క్లుప్తంగా

20 మందికి రక్తదానం



అమలాపురం ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేస్తున్న వివేకానంద యోగాశ్రమం సభ్యులు

పి.గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న పేషెంట్లకు పప్పులవారిపాలెం స్వామి వివేకానంద యోగాశ్రమం గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువత రక్తదానం చేస్తూ ఆదుకుంటున్నారు. అమలాపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పి.గన్నవరం మండలం కె.ముంజవరం గ్రామానికి చెందిన పి.దుర్గయ్యకు రక్తం అవసరం కాగా, మంగళవారం రక్తదానం చేశారు. అలాగే మంగళవారం ఒక్క రోజునే కాకినాడ, అమలాపురం, తణుకు, రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రులో 20 మంది రోగులకు రక్తదానం చేసినట్టు యోగా గరువు శ్రీనివాస్ తెలిపారు. తాము ఇప్పటి వరకూ 18 వేల మందికి రక్తదానం చేసినట్టు శ్రీనివాస్ వివరించారు. మంగళవారం నాటి రక్త దాతలు ఎస్.కార్తీక్, ఎం.ప్రదీప్, ఇ.వెంకట్, ఎస్.మధుసూదన్, సుదీర్, డేవిడ్, చంటి, బాలాజీ, కాశీ, అప్పారావు, సాయి, వెంకట్, దుర్గా పవన్‌లను రోగులు, వారి కుటుంబ సభ్యులు అభినందించారు.

స్వచ్ఛందంగా మ్యాన్ హోల్ ఏర్పాటు



నగరంలో స్వచ్ఛందంగా మ్యాన్ హోల్ ఏర్పాటు చేస్తున్న యువకులు

మామిడికుదురు: నగరం గ్రామంలోని బడే బీబీ పంజా వద్ద ముంపునీరు నిలిచిపోయి స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఇక్కడ మోకాలి లోతు నీరు నిలిచిపోతుంది. ముంపు నీటి సమస్యతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొహర్రం సంతాప కార్యక్రమాలు ప్రారంభం కావడం, వర్షం నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముంపు నీటి మళ్లింపునకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా సొంత ఖర్చులతో మ్యాన్ హోల్ ఏర్పాటు చేసి ముంపు నీటిని స్థానికంగా ఉన్న డ్రైన్‌లోకి మళ్లించే విధంగా మంగళవారం చర్యలు చేపట్టారు. సమస్యను స్వచ్ఛందంగా పరిష్కరించుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు నూర్జెన్ అబ్బాస్, అక్బర్ అలీ, గుల్షన్ అబ్బాస్, తల్మీజ్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



ములికిపల్లిలో ఎరువుల షాపు వద్ద తూకం తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజోలు: రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాల బస్తాల తూకంలో మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఏడీఏ ఎల్‌వీ మధు అన్నారు. మంగళవారం మండలంలోని ములికిపల్లి, మలికిపురం మండలం లక్కవరం గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి వివరాలను నమోదు చేసుకున్నారు. రైతులకు విక్రయించిన ఎరువుల బస్తాలను స్వయంగా తూకం వేసి పరిశీలించారు. విజిలెన్స్ ఏడీఏ మధు మాట్లాడుతూ రైతులకు కొనుగోలు చేసే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు తదితర వస్తువుల విషయంలో ఎలాంటి మోసాలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విజిలెన్స్ సీఐ ఎస్.లక్ష్మాజీ, ఏవో వై.మధుకుమార్ పాల్గొన్నారు.

భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలి

మామిడికుదురు: భూ యజమాని సంతకం నిబంధన తొలగించి, గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు సీసీఆర్ గుర్తింపు కార్డులు అందించాలని రాష్ట్ర కౌలు రైతుల సంఘం కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య క్రమంగా పెరుగుతుందన్నారు. నూటికి 70 శాతం మంది కౌలు రైతులే భూమిని సాగు చేస్తున్నారని చెప్పారు. కార్డులు మంజూరు చేసిన ప్రతి ఒక్కరికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కులాలతో సంబంధం లేకుండా భూమిలేని ఓసీ రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలన్నారు. పంట కాలువలు, మురుగు కాలువలు బాగు చేయించాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందించాలన్నారు. జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, కారెం వెంకటేశ్వరరావు, తాటికాయల ఉదయభాస్కరరావు, పెచ్చెట్టి విజయభాస్కరరావు, తాడి రామ్మూర్తి, పాలమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

- వెంటాడుతున్న కార్మికుల లేమి
- పేరుకుపోయిన చెత్త, మురుగుపారని డ్రైన్లు
- వ్యాధుల సీజన్ కావడంతో చెత్త, పూడిక తొలగింపు పనులు



కొత్తపేట కౌశిక రోడ్డులో చెత్తను తొలగిస్తున్న జేసీబీ



కొత్తపేట రామయ్య వీధిలో డ్రైన్‌లో పూడిక తొలగిస్తున్న జేసీబీ

కొత్తపేట: వర్షాకాలం ప్రారంభమైంది.. దానికి తోడు గ్రామాల్లో తగినంత మంది పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో రెగ్యులర్‌గా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో వ్యాధుల సీజన్ ముంచుకొచ్చింది.. ఇప్పటికే అక్కడక్కడా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. సుమారు 25 కిలో మీటర్ల విస్తీర్ణంలో ప్రధాన గ్రామం, సుమారు 35 శివారు గ్రామాలు గల ఈ పంచాయతీ పరిధిలోని ప్రధాన వీధుల్లో (వాణిజ్య రోడ్లు) ప్రతిరోజు, ఇతర వీధులు, శివారు గ్రామాల్లో వారానికి ఒకరోజు పారిశుధ్య చర్యలు చేపట్టాలి. గతంలో ఆ విధంగా పారిశుధ్య నిర్వహణ సాగేది. గత కొంతకాలంగా వారానికి ఒకరోజు కూడా పారిశుధ్యం చేట్టడం లేదని ప్రజలు వాపోయారు. దాంతో పారిశుధ్యం పడకేసింది. దానికి కారణం తగినంత మంది పారిశుధ్య సిబ్బంది లేకపోవడమేనని పంచాయతీ సిబ్బంది తెలిపారు. గ్రామ విస్తీర్ణానికి అనుగుణంగా 30 మంది పారిశుధ్య కార్మికులు అవసరం ఉంది. కానీ ప్రస్తుతం 20 మంది మాత్రమే ఉన్నారు. వారిలో ఇద్దరు, ముగ్గురు సెలవు పెడుతుంటారు. దాంతో రెగ్యులర్‌గా పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు అవకాశం లేక ఉన్నవారితోనే పారిశుధ్య నిర్వహణ సాగిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధాన కూడలి అయిన రావులపాలెం పంచాయతీ విస్తీర్ణం కొత్తపేట విస్తీర్ణం కంటే తక్కువే ఉన్నా ఆ పంచాయతీలో 65 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఇక్కడ మాత్రం 20 మంది కూడా పనిచేయడం లేదు. అలాగే అవసరమైన ట్రాక్టర్లు లేకపోవడం కూడా అపారిశుధ్యానికి కారణమౌతుంది. ఇక్కడ 6 ట్రాక్టర్లు అవసరం కాగా ప్రస్తుతం 4 మాత్రమే పనిచేస్తున్నాయి.

వ్యాధుల సీజన్‌తో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

ఇప్పటికే ఉన్నతాధికారులు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కింద మంచినీటి ట్యాంకులను శుభ్రం, పరిసరాలు పరిశుభ్రం చేశారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలకు, వాటి నుంచి పైపులైన్లకు తాగునీరు సరఫరా చేసే మంచినీటి పైపులు లీకై నీరు కలుషితం కాకుండా గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా అంటు వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు ప్రస్తుతం నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో పంచాయతీ కార్యదర్శి వీవీ రామన్ ఆధ్వర్యంలో సచివాలయాల కార్యదర్శులు, శానిటేషన్ పర్యవేక్షకులు దగ్గరుండి పారిశుధ్య చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా వీదుల్లో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త తొలగించడంతో పాటు జేసీబీల ద్వారా కౌశికరోడ్డు, ప్రధాన రహదారుల వెంబడి చెత నిల్వలను, డ్రైన్లలో మురుగు నీరు ముందుకు పారకుండా పేరుకుపోయిన పూడికతీత తొలగింపు పనులు చేపట్టారు.

యుద్ధప్రాతిపదికన పారిశుధ్య చర్యలు

పంచాయతీ పరిధిలో అవసరం మేరకు పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందితోనే పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభంతో పాటు వ్యాధుల సీజన్ కావడంతో అపారిశుధ్యం లేకుండా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాం. దానిలో భాగంగా జేసీబీలను పెట్టి పేరుకుపోయిన చెత్త నిల్వలు తొలగింపు, డ్రైన్లలో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాం.

– వీవీ రామన్, పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట

వైద్య పరీక్షలతో ప్రసవ మరణాలు తగ్గుతాయి



అంబాజీపేటలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: గర్భిణులకు సక్రమంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తే ప్రసవ మరణాలు తగ్గుతాయని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారులు వి.గౌతమి, కేఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ యోజన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటివద్దే ప్రసవాలు జరిగేవని అప్పట్లో నవజాత శిశువుల మరణాల రేట్లు ఎక్కువగా ఉండేవని, కామెర్ల వ్యాధి సోకేదన్నారు. ప్రస్తుతం పీఎంఎస్ఎంఏలో ప్రతినెలా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం వల్ల ఆరోగ్యం ఎంతో మెరుగుపడి వైద్యులు సూచించిన పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారన్నారు. స్థానిక జనసేన నాయకులు సమకూర్చిన పోషకాహార కిట్లను 45 మంది గర్భిణులకు పంపిణీ చేశారు. స్థానిక పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే సత్యనారాయణ తన సొంత నగదు రూ.25 వేలను వైద్యాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీఓ వి.సరోవర్, నాయకులు పాల్గొన్నారు. పుల్లేటికుర్రులో జీడీఎం చర్చిలో అంబాజీపేట మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ ఎస్.లాజర్ ఆధ్వర్యంలో కార్యదర్శి బీఆర్ విలియమ్స్ అధ్యక్షతన ఎమ్మెల్యే సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, పాస్టర్లు పాల్గొన్నారు.

ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకున్న పీఎంఎస్ఎంఏ

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకం మంగళవారం నాటికి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్, ఆర్.మల్లికార్జున్ నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. పీఎంఎస్ఎంఏ పథకంలో భాగంగా పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 132 మంది గర్భిణులకు వైద్య,రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిది లేక పదో తేదీన బాలింతలు, గర్భిణులకు ఏఎంఎస్ఎంఏ ద్వారా నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి వైవీ ప్రియాంక ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా 35 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. బొల్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో వారికి పౌష్టికాహారం అందించారు. ఎంపీహెచ్‌ఈఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ ఏకే దుర్గాబాయి, ఎంపీహెచ్ఎస్‌లు బీవీవీఎస్ఎన్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.గన్నవరం సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య సేవలు అందించారు. వేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, డాక్టర్ రాఘవేంద్రరావు, హెడ్ నర్సు అనంతలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

వరద నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు



పి.గన్నవరం అక్విడెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



వెదురుబిడెం వద్ద ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ

పి.గన్నవరం: గోదావరి నదికి వరదలు వస్తే ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలకు తావివ్వకుండా వరద ముంపు నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. వరదల సీజన్ నేపథ్యంలో మంగళవారం ఆయన పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడెక్టును పరిశీలించారు. అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న వరద రక్షణ గేట్ల నిర్వాహణ, బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఏటిగట్ల పటిష్టత వంటి అంశాలపై కలెక్టర్ ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్విడెక్టుపై అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు, బ్రిడ్జిపై లైటింగ్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఏటిగట్ల పటిష్టతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అక్విడెక్టుకు చేపట్టాల్సిన మరమ్మతులు, వరదల నేపథ్యంలో లంక ప్రాంత ప్రజల ఇబ్బందులను కలెక్టర్‌కు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్.త్రిశూలపాణి, డీఈఈలు గుమళ్ల శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏఈలు టీవీఎల్ఎన్ మూర్తి, సుందర్‌సింగ్, ప్రసాద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రభావిత ప్రాంతాల పరిశీలన

అయినవిల్లి: గోదావరి వరద వల్ల అయినవిల్లి మండలంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ మంగళవారం పర్యటించారు. వరదలకు రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ వరద ప్రమాదంపై సూచనలు చేయాలన్నారు. వీరవల్లిపాలెం పుష్కరఘాట్, ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడిం వద్ద కాజ్‌వే వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక ఇసుక రీచ్ వద్ద వరదనీరు వస్తే నీటి మట్టం ఎంత వరకూ వస్తుందో తహసీల్దార్ ప్రమద్వర, రెవెన్యూ సిబ్బంది ఆర్డీఓకు వివరించారు. వీరవల్లిపాలెంలోని పునరావాస కేంద్రాల వద్ద పరిస్థితిని గమనించారు. ఆర్డీఓ వెంట వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రోడ్ల ఆక్రమణతో తీవ్ర ఇబ్బందులు

ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ, గ్రామీణ, పంచాయతీ రాజ్ రహదారులు ఆక్రమణలకు గురి కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని చోట్ల అధికారులే ఆక్రమణలను క్రమబద్ధీకరించారని రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మలికిపురంలో నియోజకవర్గ స్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రోడ్ల ఆక్రమణల వల్ల ప్రజ్లు రాకపోకలకు ఇబ్బంది పడి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో వేస్తున్న లే అవుట్‌పై పంచాయతీ అధికారులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. జిల్లా పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగానే అనుమతులు ఇవ్వాలని సూచించారు. అనుమతి లేని లే అవుట్లలో ప్రజలు ఇండ్ల స్థలాలు కొనుగోలు చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలపై మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగాలని సూచించారు. రెవిన్యూ, దేవస్థానం, పంచాయతీ స్థలాలు ఆక్రమణలపై ఆయా శాఖల వివరణ కోరారు. అంతర్వేది దేవస్థానం భూముల కౌలు వసూలు, భూముల రక్షణపై అధికారులను ఆరా తీశారు. అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి వారి కౌలు బకాయిలు రూ.1.70 కోట్లు ఉందని వాటి వసూలుపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులతో పాటు మండల అధికారులు, పార్టీ నాయకులు గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహలక్ష్మి ప్రసాద్, ముప్పర్తి నాని, పినిశెట్టి బుజ్జి, గంటా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్ బజార్‌లోనే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలి

అంబాజీపేట: అమలాపురం సర్క్యులర్ బజార్‌లో ఏర్పాటు చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను యథాస్థానంలో కొనసాగించాలని కోనసీమ కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ (కోకోఫెడ్) చైర్మన్ అరిగెల బలరామమూర్తి కోరారు. దీనికి సంబంధించి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బలరామమూర్తి మాట్లాడుతూ గతంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సర్క్యులర్ బజార్‌లో ఉండేదని అనంతరం స్థానిక హెడ్ పోస్టాఫీస్‌కు తరలించారన్నారు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్థానిక మునిసిపాలిటీ అద్దె లేకుండా బజార్‌లోని పాత దుకాణాలను ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు.

రోడ్డుకు మరమ్మతులు నిర్వహించండి



అధ్వానంగా మారిన అప్పనపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు



కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారిన కొత్తూరు-వెదురుమూడి రోడ్డు

మామిడికుదురు: పాశర్లపూడి కరకట్ట దిగువ నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడి ఆ గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఒక మాదిరి వర్షం కురిసినా ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి నిత్యం అనేక మంది భక్తులు వస్తున్నారు. భక్తులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. బి.దొడ్డవరం నుంచి పెదపట్నంలంక వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. పాశర్లపూడి నుంచి అప్పనపల్లి వరకు ఆర్అండ్‌బీ రోడ్డు కొంత మేర అభివృద్ధికి నోచుకున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డు ఆధునీకరణపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చిరుజల్లులతో చిత్తడి చిత్తడి

ఆలమూరు: నైరుతి పవనాల దృష్ట్యా వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రధాన రహదారులన్ని చిత్తడిగా మారిపోయాయి. దీంతో వాహనదారులు ఎక్కడ జారి పడతామేమోనని ఆందోళన చెందుతున్నారు. పాదచారులైన కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఇటీవల కొత్తూరు–వెదురుమూడి రోడ్డులో మరమ్మతులను ప్రారంభించినా మళ్లీ ఆపివేయడం వల్ల అస్తవ్యస్తంగా తయారైంది. రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణం చేసేందుకు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం దృష్ట్యా మండలంలోని వివిధ రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన చెత్త చెదారాన్ని తొలగించి బెర్మ్‌లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల మరమ్మతులు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు సత్వరమే స్పందించి త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి భవిష్యత్‌లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీకాం జనరల్ కోర్సు కొనసాగించాలి

ఆలమూరు: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సులను కొనసాగించి విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆలమూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ చేరేందుకు వీలుగా ప్రభుత్వం వెలువరించిన నోటిఫికేషన్‌లో బీకాం కోర్సులు రద్దు చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయం సమంజసంగా లేదన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే బీకాం కోర్సుల రద్దుపై తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కోర్సు చదవడానికి శ్రద్ధ చూపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ తొలగిస్తున్నట్లు ప్రకటించినా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించడం ద్వంద్వ నీతికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఈనిర్ణయాల వల్ల భవిష్యత్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మూతపడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరమే స్పందించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 10 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియలో బీకాం జనరల్ కోర్సులకు ప్రవేశాలకు అనుమతించాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

నీటమునిగిన ఆకుమడులు



పొన్నమండలో చెరువును తలపిస్తున్న నారుమడి

రాజోలు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమడులు ముంపునకు గురయ్యాయి. మంగళవారం మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వరినారుమడులను పరిశీలించారు. కాట్రేనిపాడు, పొన్నమండ, కూనవరం, ములికిపల్లి, కడలి గ్రామాల్లో నారుమడులు పూర్తిగా నీటమునిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆకుమడులు వేసిన వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. ముంపునీరు దిగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముంపునీటి నుంచి వరినారుమడులను రక్షించుకునేందుకు వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు చేశారు. ముంపునీరు బయటకు వెళ్లేందుకు మార్గాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటమునిగి నారుమడిలో ఐదు సెంట్ల విస్తీర్ణానికి రెండు నుంచి మూడు కేజీల యూరియా, రెండు కేజీల పొటాష్, ఒక కేజీ సూపర్ ఎరువు వేయాలన్నారు. అలాగే బూజు తెగుళ్లు సోకకుండా 10 మిల్లీ లీటర్ల ప్రొపైకోనాజోల్(టెల్ట్) మందును 50 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

54 మందికి కంటి వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. మొత్తం 54 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 12 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ధారించారు. కార్యక్రమానికి హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యం వహించారు.

మాసోత్సవాలతో డెంగీపై అవగాహన

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి డెంగీ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలని గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ ముఖ్య కూడళ్లలో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి కోరారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీలతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో మంగళవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈనెల ఒకటి నుంచి ప్రారంభించి 31 వరకూ కొనసాగనున్న నిర్వహించే డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవాల ఆవశ్యకతను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా 'రాయపూడి'



మాచవరంలో నూతనంగా ఎన్నికైన కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం

అంబాజీపేట: అంబాజీపేట మండలం కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాయపూడి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మాచవరంలో ఉన్న కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం భవనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు మండ వీరభద్రరావు ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సంఘం గౌరవ అధ్యక్షుడిగా చిరతపూడి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ర్యాలి భాస్కరరావు, కోశాధికారిగా దేవగుప్తాపు ఏసుదాసు, ఉపాధ్యక్షులుగా మానేపల్లి నాగరాజు, సహాయ కార్యదర్శులుగా చిరతపూడి దుర్గాప్రసాద్, ముద్రగడ శివ, ఆర్గనైజర్‌గా ర్యాలీ భద్రకిరణ్‌లతో పాటు మరో ఐదుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ నూతన సభ్యులకు సంఘ సభ్యులు పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు మృతి

పెరవలి: అతి వేగం ఒకరి ప్రాణాలు బలిగొనగా, మరో ఇద్దరు గాయపడడానికి కారణమైంది. పెరవలి ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూలి పనులు చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న మహిళలు మంగళవారం రాత్రి మండలంలోని ఖండవల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి దాటుతున్నారు. అదే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వైపు బైక్‌పై వేగంగా వస్తున్న కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు (59) ఆ మహిళలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన ఖండవల్లికి చెందిన కుంచె నాగమణి, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఢీకొట్టిన వెంకటేశ్వరరావు బైక్ పై నుంచి ఎగిరిపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన వాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.